పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ

కర్నూలు, కలెక్టరేట్ జనవరి 16 : జిల్లాలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై బుధ, గురువారం రోజులలో శిక్షణ కార్యక్రమం జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు ఒక ప్రకటనలో తెలపారు. ఎంపీడీఓ, ఈఓఆర్డీ, పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్‌లు, వార్డు సచివాలయ అధికారులు, ఎంపీటీసీలు తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని తెలియజేశారు. అదేవిధంగా తిరుపతిలోని పద్మావతి మహిళా యూని వర్సిటీలో 3 రోజులపాటు 'ఆరోగ్యవంతమైన గ్రామపంచాయతీ' అనే అంశంపై నేషనల్ కాన్ఫరెన్స్ జరుగుతుందని తెలిపారు.



టికెట్ల తకరారు..!

- వైసీపీ నాలుగో లిస్ట్ రెడీ..
- అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో టెన్షన్
- ఇన్‌చార్జిల మార్పుతో సిట్టింగుల్లో కలవరం
- బాబాయ్-అబ్బాయిల్లో ఒక్కరికే చాన్స్?
- కాటసాని బ్రదర్స్ సేఫ్
- నందికొట్కూరులో సిద్ధార్థరెడ్డి మాట నెగ్గేనా?

నంద్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

అసాధ్యపు హామీలతో అధికారంలోకి వచ్చిన వైసీపీకి నేడు ఎదురుగాలి వీస్తోంది. హామీలు అమలు చేయలేకపోవడంతో ప్రజల్లో ఇప్పటికే ఆ పార్టీ విశ్వసనీయత కోల్పోయింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ డొల్ల అని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రజలకు ఎక్కువ కాలం పట్టలేదు. గడిచిన నాలుగున్నరేళ్లలో అధికార పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఈ తరుణంలో మరో రెండు నెలల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేక సెగ తగులుతోంది. దీన్ని పసిగట్టిన వైసీపీ కొంతైనా వ్యతిరేకతను తగ్గించుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ఆయా నియోజకవర్గ సమన్వయకర్తల మార్పునకు శ్రీకారం చుట్టింది. ఇక నంద్యాల జిల్లా అభ్యర్థుల విషయంలోనూ వైసీపీ అధిష్టానం ఇదేతీరును ప్రదర్శిస్తోంది. నంద్యాల జిల్లా సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కలవరం మొదలైంది. పార్టీ పరంగానే కాకుండా, అభివృద్ధి సరిగా జరగపోవడంతో ప్రజల్లో తమ మీద వ్యతిరేకత ఉందన్న విషయం ఇప్పటికే వైసీపీ ఎమ్మెల్యేలకు అర్థమైంది. ఈ సాకును చూపించి పార్టీ తమకు టికెట్లను ఎక్కడ నిరాకరిస్తుందోననే భయాందోళనలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొట్టుమిట్టాడుతున్నారు. నాలుగైదు రోజుల్లో వైసీపీ విడుదల చేయబోయే నాలుగో జాబితాలో తమ పేర్లు ఉంటాయో.. ఉండవో అనే టెన్షన్‌లో ఎమ్మెల్యేలు ఉన్నారు.

మొదటి వికెట్ అదేనా..?



జిల్లాకు సంబంధించి వైసీపీ టికెట్ల విషయంలో మొదటి వికెట్ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రనాథ్‌రెడ్డి (నాని) అని ప్రచారం బాగా జరుగుతోంది. ఎమ్మెల్యేగా ఎన్నికైన దగ్గర నుంచి వివిధ నియోజకవర్గ అభివృద్ధి కోసం చూపిన శ్రద్ధ కంటే.. తన సొంత ఆస్తులు పెంచుకోవడం మీద చూపెట్టారన్న అభిప్రాయం ఆళ్లగడ్డ ప్రజలతో పాటు, సొంత పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల నుంచి వినిపిస్తోంది. దీనికి తోడు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, అంగన్‌వాడీ పోస్టుల విషయంలోనూ డబ్బు తీసుకున్నట్లు గతంలో విమర్శలు వినిపించాయి. ఇవే కాకుండా రేషన్ బియ్యం దందా ఆళ్లగడ్డ రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచింది. ఎర్రమట్టి తవ్వకాలతో ఎమ్మెల్యే అనుచరులు చెరువులను, గుట్టలను గుల్ల చేసేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే గంగుల నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. వచ్చే ఎన్నికల్లో బ్రిజేంద్రనాథ్‌రెడ్డికి టికెట్ ఇస్తే గెలుపు కష్టమేనన్న అభిప్రాయానికి వైసీపీ అధిష్టానం వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనను తప్పించి, ఆయన తండ్రి ప్రభాకర్‌రెడ్డికి టికెట్‌ను ఇవ్వనున్నట్లు ప్రచారం నియోజకవర్గంలో గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే వైసీపీ అధిష్టానం నానీని పిలిచి మాట్లాడినట్లు తెలుస్తోంది.

డోన్ నుంచి మళ్లీ బుగ్గన..



డోన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు. గెలిచిన తర్వాత ఆర్థిక మంత్రి పదవిని కూడా దక్కించుకున్నాడు. తమ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే రాష్ట్ర కేబినెట్‌లో ముఖ్య పదవిలో ఉన్నాడని, ఇక తమ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ప్రజలు భావించారు. అయితే ప్రజలు అనుకున్నట్లుగా నియోజకవర్గం అభివృద్ధి ఏమీ జరగలేదు. దీంతో ప్రజలు బుగ్గన పట్ల అసంతృప్తితో ఉన్నారు. నియోజకవర్గం నుంచి వ్యతిరేకత వస్తున్నా.. బుగ్గనను పక్కకు పెట్టే సాహసం జగన్ చేయడు. ఈ లెక్కన డోన్ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి బుగ్గనే అన్నది స్పష్టమవుతోంది.

నందికొట్కూరుకు కడప వ్యక్తి?





జిల్లాలోని ఏకైక ఎస్సీ నియోజకవర్గమైన నందికొట్కూరు అభ్యర్థి విషయం సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. సీఎం జగన్ కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యం దృష్ట్యా ఎమ్మెల్యే ఆర్థర్ ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే జగన్ మాత్రం ఈ సారి ఆర్థర్‌కు టికెట్ లేదని ముందుగానే చెప్పినట్లు సమాచారం. మరోవైపు బైరెడ్డి సిద్ధార్థ స్థానికులనే నందికొట్కూరు అభ్యర్థిగా ప్రకటించాలని అడిగినా ఆయన మాటను కూడా సీఎం జగన్ పట్టించుకోలేదని తెలుస్తోంది. ఇప్పటికే కడపకు చెందిన డాక్టర్ సుధీర్‌ను జగన్ ఖాయం చేసినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. గతవారం దాదాపుగా అన్ని ఎస్సీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ నందికొట్కూరుకు మాత్రం ఎవరన్నది ఖరారు చేయలేదు. దీంతో కడప జిల్లాకు చెందని సుధీర్ గట్టిగా పట్టుపట్టినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా నందికొట్కూరులో ఇక్కడ బైరెడ్డి సిద్దార్థరెడ్డి పంతం నెగ్గుతుందో? లేదో చూడాలి మరి.

బాబాయ్ - అబ్బాయిలకు టికెట్ దక్కేనా?





నంద్యాల, శ్రీశైలం నియోజకవర్గాల్లో శిల్పా కుటుంబం చక్రం తిప్పుతోంది. నంద్యాల నుంచి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఎమ్మెల్యేగా కొనసాగుతుండగా, శ్రీశైలంలో ఆయన బాబాయి శిల్పా చక్రపాణిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న విషయం తెలిసిందే! శిల్పా చక్రపాణిరెడ్డికి నియోజకవర్గంలో సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలతో సఖ్యత లోపించడంతో పాటు, ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి ఏదో వివాదంలో చిక్కుకుంటున్నారు. ఇక నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇక్కడి నాయకులను కలుపుకుపోవడంలో విఫలం కావడం, స్థానికంగా అందుబాటులో ఉండకుండా 'సండే ఎమ్మెల్యే'గా పేరు తెచ్చుకున్నాడు. వచ్చే ఎన్నికల్లో శిల్పా రవి గెలుపు కష్టమేనన్న అభిప్రాయం నంద్యాల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. రేపోమాపో వైసీపీ అధిష్టానం నుంచి శిల్పా రవికి పిలుపు రానుందన్న చర్చ కూడా నియోజకవర్గంలో జరుగుతోంది. దీంతో ఆయన తండ్రి శిల్పా మోహన్‌రెడ్డి నష్ట నివారణ చర్యలకు పూనుకుని, వైసీపీలోని నాయకులు, కార్యకర్తలు చేజారి పోకుండా ఉండేందుకు రంగంలోనికి దిగినట్లు తెలుస్తోంది. తమకు వస్తున్న వ్యతిరేకతతో ఈ సారి బాబాయి - అబ్బాయిల గెలుపు కష్టమేనన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా శ్రీశైలంలో తనకు ఎదురు గాలి వీస్తోందని అర్థం చేసుకున్న చక్రపాణిరెడ్డి నంద్యాల నుంచి పోటీ చేస్తే బాగుంటుందన్న ఆలోచనను ఏడెనిమిది నెలల కింద రవి వద్ద ప్రతిపాదించినట్లు సమాచారం. ఆయన నంద్యాల వస్తే తన టికెట్ పరిస్థితి ఏమిటన్న ప్రశ్న వేయడంతో ఇద్దరి మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగినట్లు కూడా ప్రచారంలో ఉంది. వీరి ఆలోచన ఇలా ఉంటే.. జగన్ ఆలోచన మరో విధంగా ఉన్నట్లు తెలుస్తోంది. శిల్పా కుటుంబంలోని వారికే రెండు టికెట్లు ఇస్తే వారి ప్రాబల్యం జిల్లాలో ఎక్కువ అవుతోందని, కాబట్టి ఒక టికెట్ మాత్రమే కేటాయించాలని భావించినట్లు తెలుస్తోంది. ఇదే విధానాన్ని అనుసరిస్తే శిల్పా కుటుంబంలో ఒకరికి మాత్రమే టికెట్ వచ్చే అవకాశం ఉంది.

సోదరులకు ఖాయమైనట్లేనా..?






ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పటి నుంచి కాటసాని సోదరులు రాంభూపాల్‌రెడ్డి, రామిరెడ్డి జిల్లాలో చక్రం తిప్పారు. ఒకరు తెరమీద ఉంటే.. మరొకరు తెరవెనుక ఉంటూ రాజకీయం సాగించారు. ప్రస్తుతం పాణ్యం నియోజకవర్గం నుంచి రాంభూపాల్‌రెడ్డి, బనగానపల్లె నియోజకవర్గం నుంచి రామిరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. పాణ్యం నుంచి పలుమార్లు గెలిచిన రాంభూపాల్‌రెడ్డి ఈ సారి కూడా టికెట్ తనకే అన్న ధీమాలో ఉన్నారు. సీఎం జగన్‌కు సన్నిహితుడిగా పేరున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గతంలో పాణ్యం టికెట్‌ను అడగ్గా.. రాంభూపాల్‌రెడ్డిని కాదని ఇచ్చే ప్రసక్తే లేదని చెప్పినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. దీంతో పాణ్యం టికెట్ రాంభూపాల్‌రెడ్డికే ఖాయమైనట్లు తెలుస్తోంది. తాజాగా రాంభూపాల్ రెడ్డి కుమారుడు శివనరసింహారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పార్టీ మాకు కాకపోతే మరెవరికి టికెట్ వస్తుందన్నట్లు ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఇక బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి వైసీపీ కాటసాని రామిరెడ్డిని కాదని వేరే వారికి ఇచ్చే ఆలోచన చేయడం లేదు. కుటుంబానికి ఒక టికెట్ మాత్రమే అన్న భావనతో వైసీపీ అధిష్టానం ఇతరులకు ఛాన్స్ ఇద్దామన్నా.. రామిరెడ్డికి వ్యతిరేకంగా నిలబడి టికెట్ ఆశించే ధైర్యం ఆ పార్టీలో మరెవ్వరికీ లేదు. ఈ లెక్కన అటు పాణ్యం, ఇటు బనగానపల్లె టికెట్లు కాటసాని సోదరులకేనని తెలుస్తోంది.



- కనుమ రోజున శ్రీశైలంలో గోపూజ
- కన్నులపండువగా లీలా కల్యాణోత్సవం
- నేడు యాగపూర్ణాహుతి, ధ్వజావరోహణ



కైలాస వాహనంపై శివపార్వతులు





శ్రీశైలం, జనవరి 16: శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అనంతరం చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, జపాలు, రుద్రపారాయణలు, చతుర్వేదపారాయణాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కైలాసవాహనంపై ఆశీనులు చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ వెలుపలకు తోడ్కొని వచ్చి క్షేత్రవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కనుమ సందర్భంగా ఆలయంలో గో పూజను ఘనంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా సోమవారం సంక్రాంతి రోజున స్వామి, అమ్మవార్ల లీలా కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. శివపార్వతుల కల్యాణోత్సవానికి చెంచు భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చెంచు భక్తులు నూతన వస్త్రాలను, వెదురు బియ్యం, ఈతాకులతో రూపొందించిన బాసికాలు, స్వామివారి యజ్ఞోపవీతం, అమ్మవారి వడ్డానం, ఇతర సామగ్రిని సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులు నందివాహనంపై విహరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజు, ఉభయదేవాలయాల అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు. స్వామివారి సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం యాగ పూర్ణాహుతి, ధ్వజావరోహణ కార్యక్రమాలు జరగనున్నాయి.

భక్తుల చెంతకు నారసింహుడు

- కల్యాణోత్సవానికి ఆహ్వానం పలికిన శ్రీవారు
- 33 గ్రామాల్లో 43 రోజుల పాటు కొనసాగనున్న పర్యటన



సంప్రదాయ ప్రకారంగా స్వామిపై విల్లంబులు వేస్తున్న చెంచులు

ఆళ్లగడ్డ, జనవరి 16: తన కల్యాణోత్సవానికి ఆహ్వానం పలికేందుకు సాక్షాత్తూ ఆ నారసింహుడే కదిలాడు. అహోబిలం క్షేత్రం నుంచి బయటకొచ్చి భక్తులను ఇంటింటికీ పిలిచేందుకు బయల్దేరాడు. ఎక్కడా లేని విధంగా తన ఉత్సవాలకు నరసింహస్వామి కదిలివచ్చి భక్తులకు ఆహ్వానం పలికే అపురూప ఘట్టం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో తరతరాలుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో సంక్రాంతి పర్వదినం అనంతరం మార్చిలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. అందులో భాగంగా తన కల్యాణోత్సవానికి రావాలనే పిలుపుతో అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి (భక్తుల చెంతకు భగవంతుడు) పార్వేట మంగళవారం ప్రారంభమైంది. ఉత్సవంలో భాగంగా చెంచులు స్వామివారిపై విల్లంబులు ఎక్కుపెట్టారు. అనంతరం ఉత్సవపల్లకి బయలుదేరే ముందు వేదపండితులు అన్నకూటోత్సవం, కుంభహారతి ఇచ్చారు. స్వామికి నివేదించిన ప్రసాదాన్ని గుడికట్టుదారులు, గ్రామసేవకులు, స్వామి సేవకులకు పంచిపెట్టారు. ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాల్లోని 33 గ్రామాల్లో భక్తుల ఇళ్ల వద్ద విడిది చేసి కులమతాలకు అతీతంగా పూజలందుకోనున్నారు. శ్రీవారి ఉత్సవ పల్లకి పర్యటనను మఠం అధికారులు సంపత్, మేనేజర్ శివప్రసాదు ఖరారు చేశారు. ఈ పల్లకి 33 గ్రామాల్లో 43 రోజుల పాటు కొనసాగనుంది. మంగళవారం బాచేపల్లితో మొదలైన స్వామివారి పర్యటన ఫిబ్రవరి 29న రుద్రవరంలో ముగిసి అదే రోజు అహోబిలం క్షేత్రానికి చేరుకుంటుంది. అందులో భాగంగా స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శివప్రసాద్, ప్రధాన అర్చకుడు వేణు గోపాలన్, సౌమ్యా నారాయణ్ పాల్గొన్నారు. అదేవిధంగా అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహ స్వామి మాలధారణ దీక్ష మంగళవారం ప్రారంభమైంది. దీక్షా పరుల సమక్షంలో ప్రధాన అర్చకుడు హోమం నిర్వహించి దీక్షాపరులకు మాలధారణ చేశారు. నరసింహస్వామి దీక్షను సుమారు 500 మంది స్వీకరించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించాలి

హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్‌రెడ్డికి ఘన సన్మానం

పగిడ్యాల, జనవరి 16: యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని కష్టపడి సాధించి ఉన్నతమైన స్థానంలో నిలవాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. హరినాథ్ రెడ్డి అన్నారు. ప్రాతకోట గ్రామానికి చెందిన బాలవెంకటరెడ్డి, కృష్ణవేణి కుమారుడు హరినాథ్‌రెడ్డి దంపతులను మండల పరిధిలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా అదనపు కోర్టు జడ్జి భూపాల్‌రెడ్డి, నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు బండి జయరాజు, నందికొట్కూరు, నంద్యాల, కర్నూలు బార్ అసోసియేషన్ సభ్యులు హాజరై ఆయనను ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామమైన ప్రాతకోటకు చెందిన హరినాథ్‌రెడ్డి హైకోర్టు జడ్జి కావడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు ప్రోత్సాహంతోనే ఈ స్థితిలో ఉన్నానని అన్నారు. గ్రామీణ యువత ఒక లక్ష్యాని నిర్దేశించుకొని ప్రయోజకులు కావాలన్నారు. కష్టపడి చదువుతే సరిపోదని, లక్ష్యం ఉండాలని, అప్పుడే ఏదైనా సాధించవచ్చు అని అన్నారు.




జడ్జి హరినాథ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పరీక్షలు దగ్గర పడ్డాయి..

- ఫిబ్రవరి 5 నుంచి ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్
- మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం
- మార్చి 18 నుంచి పది పబ్లిక్ పరీక్షలు
- విద్యార్థుల్లో ఆందోళన

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 16: పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. విద్యా సంవత్సరం పూర్తయినా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు సరఫరా చేయలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విద్యార్థులకు ఉచితంగా అన్నీ సమకూర్చుతున్నట్లు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తోంది. తెలుగు, ఇంగ్లీష మీడియం పుస్తకాలు పంపిణీ చేసినా, ఉర్దూ, కన్నడ, సంస్కృతం, మైనర్ మీడియా పాఠ్య పుస్తకాల సరఫరాను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపి వేసింది. తరగతి గదుల్లో ఉపాధ్యా యులు ఇచ్చే నోట్స్‌పైన, మార్కెట్లో దొరికే మెటీరియల్‌తోనే ఆ విద్యార్థులు ప్రిపేర్ అవుతున్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పుకోవడమే తప్ప చేస్తున్నదేమీ లేదనే విమర్శలు ఉన్నాయి.



ఇంటర్‌లో 47,412 మంది విద్యార్థులు

కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 47,412 మంది ఉన్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 22,239 మంది, ద్వితీయ సంవత్సరంలో 25,173 మంది ఉన్నారు. ఫిబ్రవరి 2న మానవీయ నైతిక విలువల పరీక్ష, 3న పర్యావరణ శాస్త్ర పరీక్ష జరుగుతాయి. ఫిబ్రవరి 5న ఇంటర్ వొకేషనల్ సైన్స్ ప్రాక్టకల్స్ పరీక్షలు మొదలుకాగా, 10 వ తేది నుంచి మెయిన్ సైన్స్ గ్రూపు ప్రాక్టకల్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 1 నుంచి ఇంటర్ పబ్లిక్ థియరీ పరీక్షలు జరుగనున్నాయి.

మార్చి 18 నుంచి పది పబ్లిక్ పరీక్షలు

కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, అన్-ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 30 వేల మంది హాజరవుతున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి అయి, వీక్లీ టెస్టులు, డైలీ టెస్టులు, రివిజన్ క్లాసెస్ జరుగుతున్నాయి. మార్చి 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. ప్రైవైట్ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి మెరుగ్గా ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా ఉంది. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థుల చదువుపట్ల వారి తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకుంటున్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడులు

- 15మంది నిర్వాహకుల అరెస్టు
- 26 కేసులు నమోదు
- జిల్లా వ్యాప్తంగా 51 బైండోవర్ కేసులు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, జనవరి 16: నంద్యాల జిల్లాలో సోమ, మంగళవారాల్లో పోలీసులు, సెబ్ పోలీసులు జరిపిన విస్తృతదాడుల్లో 26 కేసులు నమోదు చేసి 14మందిని అరెస్టు చేశారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రెండ్రోజులుగా ముమ్మరంగా దాడులు, తనిఖీ చేపట్టారు. నాటుసారా బట్టీలపై దాడులు చేసి 26 కేసులు నమోదు చేసి 14మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 182 లీటర్ల సారా సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే 10 డీపీఎల్ కేసుల్లో 325 డీపీఎల్ మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్ పరిధిలో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి 15మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10 కోళ్లను, 40మోటార్‌సైకిళ్లతోపాటు రూ.19వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఎన్ఫోర్స్‌మెంట్ వర్క్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ చేపట్టి మొత్తం 13 కేసులు, 14 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 51మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి సంబంధిత అధికారులవద్ద హాజరు పరచినట్లు పోలీసులు తెలిపారు. డోన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మట్కా కేసు నమోదు చేసి రూ.3900 నగదు స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి 12మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,28,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

రైల్లో నుంచి దూకి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

నంద్యాల క్రైం, జనవరి 16: నంద్యాల-పాణ్యం రైల్వే స్టేషన్ల మధ్య శాంతిరాం కాలేజీ వద్ద మంగళవారం ఉదయం రైలులో నుంచి కిందడి ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు రైల్వే ఎస్సై జలీల్ తెలిపారు. ఈ గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ రైలు నుంచి కింద పడ్డాడా? లేక రైలు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడా? అనేది దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై జలీల్ తెలిపారు.

వలస కూలీ ఆత్మహత్య

మంత్రాలయం, జనవరి 16. మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన దాసరి అనంతస్వామి కొడుకు దాసరి రమేష్(37) గుంటూరు జిల్లా పత్తిపాడు గ్రామానికి వలస వెళ్లి అక్కడే ఉరివేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. గ్రామంలో తీవ్ర కరువు వల్ల పనులు లేకపోవడంతో భార్య మహాలక్ష్మి, ముగ్గురు కొడుకులతో మిరప పంట కోసేందుకు మూడురోజుల క్రితమే వలస వెళ్లాడు. సోమవారం తెల్లవారు జామున మిరపపొలంలో వేసు కున్న కొట్టం నుంచి వెళ్లి చెట్టుకు పంచెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. భార్య, కొడుకులు, తోటి వలస కూలీలు మృతదేహన్ని సోమవారం రాత్రి మాధవరానికి తీసుకొచ్చారు. సంక్రాంతి పండుగ పూట ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సి.బెళగల్, జనవరి 16: మండలంలోని సంగాల గ్రామానికి చెందిన నరసింహుడు 39 అనే రైతు తనకు ఉన్న 2 ఎకరాల పొలంలో ఉల్లి, మిరప పంటలను సాగుచేశాడు. బావిలో నీళ్లు లేకపోవడంతో మంగళవారం నదిలో అక్కడక్కడ ఉన్న గుంతలలోని నీటిని పారించి పంటలను బతికించుకోవాలని మోటార్‌ను, సర్వీస్ వైరును నదిలో నీటి గుంతల దగ్గరకు తీసికెళ్లి కరెంటు అమర్చే ప్రయత్నం చేశాడు. అయితే మోటార్‌కు కరెంటు సప్లయ్ కాలేదు. నీటిలో పడి ఉన్న సర్వీస్ వైరును చేత పట్టుకుని పరిశీలిస్తుండగా.. అందులో విద్యుత్ ఉంటడంతో షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. చుట్టు పక్కల పొలాల రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతునికి భార్య వెంకటేశ్వరమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. ఎస్ఐ మన్మథ విజయ్ మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం కోడుమూరుకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మినరసింహ యాదవ్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు

నంద్యాల టౌన్, జనవరి 16: ఏపీసీసీ చీఫ్‌గా ఎంపికైన వైఎస్ షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు జె.లక్ష్మినరసింహ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ నిబంధనలు, నిర్ణయాలను దివంగత నేత వైఎస్సార్ ఏనాడూ అతిక్రమించలేదన్నారు. నేడు ఆయన కుమార్తె వైఎస్ షర్మిల రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఎంపికైందన్నారు. ఆమె సారథ్యంలో కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం కోసం కార్యాచరణ బద్ధంగా ముందుకు సాగుతామన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లిపోయిన కాంగ్రెస్ వాదులందరూ తిరిగి పార్టీలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆహ్వానితుడిగా గిడుగు రుద్రరాజును నియమించినందుకు, పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిలను నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్య నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మాణిక్కం ఠాగూర్‌లకు లక్ష్మీనరసింహ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరికి కత్తిపోట్లు

కోవెలకుంట్ల, జనవరి 16: కోవెలకంట్లలోని సౌదరదిన్నె సమీపంలో నివ సించే ఓ యువతి, మరో వ్యక్తి మంగళవారం కత్తిపోటుకు గురయ్యారు. అవుకు మండలం రామాపురంకు చెందిన ఓ యువతితో కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ఓ యువకుడితో నాలుగేళ్ల క్రితం వివాహం నిశ్చయమైంది. పెళ్లి ఆలస్యం అవుతుండటంతో అమ్మాయిల బంధువులు కోవెలకుంట్ల పట్టణ సమీ పంలోని సౌదరదిన్నె సమీపంలోని డిగ్రీ కళాశాలవద్ద కాలనీలో నివసించే యువ కుడి ఇంటికి వచ్చారు. అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని అడగడంతో మాట మాటా పెరిగి ఇరువర్గాల వారు వాగ్వాదం చేసుకున్నారు. పెళ్లి కూతురు తరుపు బంధువులు పెళ్లి కొడుకు తరపు వ్యక్తులకు పొడిచారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కోవెలకుంట్ల వైద్యశాలకు తరలించారు. పోలీ సులు ఘర్షణపై విచారణ చేస్తున్నారు.

ఆర్టీసీ కాలనీలో చోరీ

కర్నూలు, జనవరి 16: తాలుకా పోలీసు స్టేషన్ పరిధిలో ఆర్టీసీ కాలనీలో నాలుగు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే వీరశేఖర్ ఇంట్లో రూ.6 వేల నగదు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. వీరశేఖర్ పనుల కోసం జమ్మలమడుగు వెళ్లి తిరిగి వచ్చాక ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించాడు. అలాగే నందికొట్కూరు వైద్యఆరోగ్య శాఖలో పని చేస్తున్న జగదీష్ పనుల నిమిత్తం పగిద్యాల వెళ్లి, మంగళవారం వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న రూ.2వేల నగదు, కొన్ని బంగారు ఆభరణాలు చోరికి గురైనట్లు గుర్తించాడు. అలాగే ఆథేనా స్కూల్‌లో వాచ్‌మెన్ వెంకటేశ్వర్లు రెండు ఇళ్లల్లో కూడా చోరీ జరిగింది. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు పండుగకు ఊరికి వెళ్లగా.. ఈయన సోమవారం రాత్రి వాచ్‌మెన్ డ్యూటీకి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న రూ.40వేల నగదుతో పాటు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలుసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ శ్రీరామ్ సంఘటనా స్థలానికి వెళ్లి దొంగతనాలపై ఆరా తీశారు. క్లూజ్ టీమ్ మూడు ఇళ్లల్లో జరిగిన దొంగతనాల గురించి వివరాలు సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు.

అధిక శబ్దాలు చేసే వాహనాలపై స్పెషల్ డ్రైవ్

18 మందిపై కేసు నమోదు

కర్నూలు, జనవరి 16: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆసుపత్రి ముందు ఓ బైక్ అధిక శబ్దం చేస్తూ వెళ్లడంతో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడని ఆసుపత్రి నిర్వాహకులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక ఐదు రోడ్ల కూడలిలో సీఐ ఇంతియాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో ట్రిపుల్ రైడింగ్, అధిక శబ్దాలతో సైలెన్సర్లు లేకుండా వున్న వాహనదారులను నిలిపి తనిఖీ చేశారు. 18 మంది వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలిసింది. వీరందరినీ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అధిక శబ్దం చేస్తూ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. అధిక శబ్దాలు చేసే వాహనాల వల్ల పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని సీఐ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అహోబిలంలో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ, జనవరి 16: అహోబిలంలో రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి(50) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందా డు. మృతుడు అహోబిలం లక్ష్మీనరసింహస్వామి మాల ధరించి, పార్వేట ఉత్సవ పల్లకి గ్రామాలకు వెళ్తున్న సమయంలో ఆ జనసందోహంలో పాల్గొనడంతో ఊపిరి ఆడక స్పృహ తప్పి కింద పడిపోయాడు. అక్కడే ఉన్న మాజీ మంత్రి అఖిలప్రియ గమనించి అతన్ని వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం వారి వాహనంలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈయన మృతి పట్ల మాజీ మంత్రి అఖిలప్రియ, ఆమె బార్గవ్‌రామ్‌నాయుడు, తమ్ముడు విఖ్యాత్‌రెడ్డి, పలువురు నాయకులు సంతాపం ప్రకటించారు.

తొంగి చూడని కంది రైతులు

- ధర చెల్లిస్తామని బతిమిలాడుకున్న మార్క్‌ఫెడ్ అధికారులు
- నెలల తరబడి డబ్బులు ఇవ్వకపోవడమే కారణమా..?

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 16: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రకటించిన మద్దతు ధరకు మించి బైటి వ్యాపారులు చెల్లించే ధర ఇస్తామని, కందులు విక్రయించమని మార్క్‌ఫెడ్ అధికారులు కోరినా రైతులు ఆ వైపు తిరిగి చూడటం లేదు. చౌక దుకాణాల్లో కందిబేడలు సప్లయ్ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నుంచి ఎంత ధరనైనా చెల్లించి కొనుగోలు చేసేందుకు సిద్ధపడుతున్నాయి. అయితే.. రైతులు మాత్రం బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులకే చెల్లించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిబేడలు రూ.150 నుంచి రూ.200 దాకా ధర పలుకుతున్నాయి. వినియోగదారులు ఈ ధరకు కొనుక్కోలేక పచ్చడి మెతుకులతో సరిపుచ్చుకుంటున్నారు. ప్రజల నిరసన ప్రస్తుత ఎన్నికల సమయంలో తమకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని గ్రహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, మార్క్‌ఫెడ్ సంస్థల ద్వారా బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెల్లించే ధరకే కందులు కొనాలని నిర్ణయించాయి. వారం కిందట ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నాఫెడ్ మేనేజర్ వినయ్‌కుమార్ కర్నూలు వచ్చి డీసీఎంఎస్ అధికారులతో సమావేశమై కందులను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెల్లించే ధరకే కొనుగోలు చేస్తామని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి కందులు కొనండని ఆదేశించి వెళ్లారు. అయితే.. ఇప్పటి దాకా రైతులు మార్క్‌ఫెడ్, నాఫెడ్‌తో పాటు డీసీఎంఎస్ కేంద్రాలకు కందులను విక్రయించేందుకు ఏ మాత్రం మొగ్గు చూపకపోవడంతో ఆ కేంద్రాలు వెలవెలబో తున్నాయి. గతంలో ప్రభుత్వం తమ నుంచి మొక్కజొన్న, కందులు తదితర పంట ఉత్పత్తులను మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిందని, అయితే.. నెలల తరబడి డబ్బులు చెల్లించలేకపోవడంతో తాము అప్పులు తీర్చుకునే అవకాశం ఇబ్బందులు ఎదుర్కొన్నామని రైతులు తెలుపుతున్నారు. మరోసారి ఈ పొరపాట్లు చేయబోమని, వ్యాపారులైతే.. వారం రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తారని అంటున్నారు.



మార్కెట్ యార్డుకు రైతులు విక్రయానికి తెచ్చిన కందులు

టీడీపీ ద్వారానే ముస్లింల అభివృద్ధి

శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్

కర్నూలు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ముస్లింల అభివృద్ధి, సంక్షేమం టీడీపీ ద్వారానే సాధ్యమని.. రాబోయే ఎన్నికల్లో సైకిల్‌కు ఓట్లేసి టీడీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. నగరంలోని మౌర్యఇన్ పరిణయ హాలులో కర్నూలు నియోజకవర్గం ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ మౌలానా, జనసేన కర్నూలు ఇన్‌చార్జి అర్షద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వం ముస్లీంల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు విడుదల చేసిందని, రంజాన్ పర్వదినాన ప్రతి ముస్లిం ఇంట ఆనందంగా జరుపుకోవాలని రంజాన్ తోఫా అమలు చేస్తే జగన్ వచ్చి రద్దు చేశారన్నారు. ఇలాంటి ఎన్నో పథకాలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. కర్నూలు నగరంలో సేవలకు కేరాఫ్ అడ్రస్‌గా టీజీ కుటుంబం ఉందన్నారు. మైనార్టీకి చెందిన వ్యక్తి అని గత ఎన్నికల్లో హఫీజ్‌ఖాన్‌ను ఎమ్మెల్యేగా ప్రజలు ఎన్నుకుంటే వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతమైనా కాపాడలేకపోయారనీ ఆరోపించారు. లక్షకు పైగా ఉన్న ముస్లింలకు న్యాయం జరగాలా..? హఫీజ్‌ఖాన్ ఒక్కడికే న్యాయం జరగాలా..? అన్న విషయాన్ని ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు ఆలోచించాలని గుర్తు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్ మాట్లాడుతూ రాజధాని బిల్లును శాసనమండలిలో అడ్డుకుని రాష్ట్రం మూడుముక్కలు కాకుండా కాపాడిన ఏకైక వ్యక్తి మండలి మాజీ చైర్మన్ షరీఫ్ అని అన్నారు. ఓట్ల కోసం కర్నూలు నాయకులు ఎన్నో నాటకాలకు తెరతీస్తారన్నారు. మైనార్టీలకు ఎంతో ఉపయోగపడే ఉర్దూ యూనివర్సిటీ నిర్మాణం పూర్తవ్వడానికి కృషి చేయలేని ఈ జేఏసీలు ఎందుకని ప్రశ్నించారు. నంద్యాలలో వైసీపీ నేతల ఒత్తిళ్లు తట్టుకోలేక ముస్లీం మైనార్టీ కుటుంబం ఆత్మహత్య చేసుకుంటే ఆ రోజు జేఏసీ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ కమిటి నగర అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వాహీద్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్సూర్ ఆలీఖాన్, రాష్ట్ర కార్యదర్శి బషీర్, కర్నూలు జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు ముంతాజ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



ఐక్యతను చాటుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, టీజీ భరత్, ముస్లిం నాయకులు

సీమ సమస్యలపై నాయకులను నిలదీయండి

నీటి అవగాహనే రాయలసీమకు రక్ష పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ఎమ్మిగనూరు, జనవరి 16: రాయలసీమకు తరతరాలుగా అన్యాయం జరుగుతోందని, రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గ నీటి సమస్య, కరువు, వలసలపై ఓట్ల కోసం వచ్చే నాయకులను నిలదీయాలని రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు పిలుపునిచ్చారు. .పట్టణంలోని ఆర్ఎంకే కోచింగ్ సెంటర్‌లో సోమవారం రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యావంతుల వేదిక నాయకుడు నాగన్న అధ్యక్షతన సభ జరిగింది. ఇందులో బొజ్జా దశరథరామిరెడ్డి రచించిన నీటిపై అవగాహనే రాయలసీమకు రక్ష అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యావంతుల వేదిక నాయకుడు కె. రత్నం ఏసేపు మాట్లాడుతూ రాయలసీమలో నానాటికీ కరువు, వలసలు ఎక్కువవుతున్నాయోకాని తగ్గటం లేదన్నారు. రాయలసీమ నుంచి అధికారంలోకి వస్తున్న పాలకులే రాయలసీమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంను పాలకులు మరింత నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారన్నారు. పాణి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడికాలువ, గుండ్రేవుల రిజర్వాయర్లు నిర్మాణం ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ కూడా ఈ ప్రాంత సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. ఈ ఎన్నికల కాలమంతా పశ్చిమ ప్రాంత రైతులు, యువకులు సీమ సమస్యల పట్ల రాజకీయ నాయకులను నిలదీసే ఉద్యమాన్ని చేపట్టాలని అన్నారు. ఈ సదస్సులో డీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, కెరె కృష్ణ, మోహన్, ప్రజా సంఘాల నాయకులు ఏసేపు, రాజేష్, గణేష్, నరసన్న, న్యాయవాది తిమ్మప్ప, నరసప్ప పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఈ బామ్మకు 105 ఏళ్లు..!

- ఘనంగా జన్మదిన వేడుకలు
- 60 మందికిపైగా తరలివచ్చిన కుటుంబ సభ్యులు



ఉయ్యాలవాడ, జనవరి 16: చూడముచ్చటగా ఉన్న ఈ గ్రూప్ ఫొటో ఏదో పూర్వ విద్యార్థుల సమ్మేళనం అనుకుంటే పొరపడినట్లే. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. పోనీ సంక్రాంతి పండుగకు కలిశారా? అంటే అదీ లేదు. ఈ కుటుంబం మొత్తానికి పెద్దదిక్కుగా ఉన్న 105 ఏళ్ల బామ్మ జన్మదిన వేడుకలకు వీరంతా హాజరయ్యారు. ఉయ్యాలవాడ మండలంలోని హరివరం గ్రామానికి చెందిన పుల్లమ్మ మంగళవారానికి 104 ఏళ్లు పూర్తి చేసుకుని 105వ ఏట అడుగుపెట్టింది. ఈ సందర్భంగా ఆయన కుమారుడు పల్లె వెంకటశివారెడ్డి తల్లి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావించాడు. దీంతో మనుమడు పల్లె మహేశ్వర్ రెడ్డితో కలిసి 105వ జన్మదిన వేడుకలను హరివరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా పుల్లమ్మకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరికి 14 మంది సంతానం కాగా మనవళ్లు, మనవరాళ్లు 28 మంది ఉన్నారు. వీరికి మరో 11 మంది ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మొత్తం 60 మంది కుటుంబ సభ్యులు కలిసి కేక్‌కట్ చేసి వృద్ధురాలికి తినిపించారు. అప్పట్లో తిన్న జొన్న సంగటి, అంబలి, జొన్నరొట్టె, రాగులు, కొర్ర అన్నం లాంటి బలమైన ఆహారం తీసుకోడం వల్లే ఇన్ని రోజులు ఆరోగ్యంగా ఉన్నానంటూ బామ్మ పుల్లమ్మ బర్త్‌డే రోజున హ్యాపీగా చెప్పడం విశేషం.



కుటుంబ సభ్యులతో వృద్ధురాలు పుల్లమ్మ

నేడు జిల్లా స్థాయి కుస్తీ పోటీలు

నంద్యాల టౌన్, జనవరి 16: నంద్యాల జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న జిల్లా స్థాయి కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి వి.రాబర్ట్ మంగళవారం తెలిపారు. స్థానిక స్పోర్ట్స్ స్టేడియంలో పోటీలు జరుగుతాయని అన్నారు. పోటీలలో వివిధ విభాగాలలో బరువుల వారీగా నిర్వహించే పోటీలో ప్రథమ స్థానంలో గెలుపొందే విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కాకినాడలో ఈ నెల 20, 21వ తేదీలలో రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు జరుగుతాయని అన్నారు. పూర్తి వివరాలకు 9676095979 కు సంప్రదించాలని కోరారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్ అధికారులు

పాణ్యం, జనవరి 16 : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి జనజాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమం బలపనూరు పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు కలెక్టరు మనజీర్ జిలానీ సమూన్, శ్రీశైలం ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, న్యూఢిల్లీ మోటా జనరల్ మేనేజరు ఆర్‌జె కచ్చప్ హాజరయ్యారు. గిరిజనులతో ముఖాముఖిలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నరేంద్రమోడీ అమలు పరుస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖలకు చెందిన స్టాల్స్‌ను కలెక్టరు, ఎమ్మెల్యే పరిశీలించారు. గిరిజనులు కేంద్రప్రభుత్వ పథకాలను సద్వియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గిరిజనులకు ఉచిత వంటగ్యాస్ ఆయుష్మాన్ భారత్, ఆధార్ కార్డులు, పంపిణీ చేశారు. సదస్సులో గిరిజన బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్డీఓ శ్రీనివాసులు, సర్పంచ్ మాధవి, ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ దస్తగిరి, తహహశీల్దారు శ్రీనివాసులు గౌడ్, గిరిజనలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


బహుమతి ప్రదానం చేస్తున్న టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి

కొత్తపల్లి, జనవరి 16: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని కొత్తపల్లి మండల టీడీపీ కన్వీనర్ నారపురెడ్డి సూచించారు. కొత్తపల్లిలోని తాండవ మల్లేశ్వరుని స్వామి తిరుణాల మహోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో దాతల సహకారంతో కబడ్డీ పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం నారపురెడ్డితో పాటు టీడీపీ నాయకులు నాగేశ్వరరావు యాదవ్, నడిపెన్న, బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి బహుమతిని కొత్తపల్లి కబడ్డీ జట్టుకు నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి రూ.15వేలు అందజేశారన్నారు. అలాగే 2,3,4వ బహుమతులను వరుసగా ఆత్మకూరు జట్టుకు రూ.10వేలు కొత్తపల్లి రాజరాజేశ్వరి హై స్కూల్ కరస్పాండెంట్ వాసుదేవరెడ్డి, తమ్మరాజుపల్లి గ్రామ విజేతలకు రూ.6వేలను జాల వెంకటరమణ, ఆత్మకూరు జట్టుకు రూ.3వేలు నగదును కొత్తపల్లి మాజీ ఉప సర్పంచ్ నడిపెన్నల చేతుల మీదుగా అందజేశామని నారపురెడ్డి తెలిపారు. క్రీడాకారులకు భోజనవసతిని శివానందరెడ్డి ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

కమనీయం తాండవ మల్లేశ్వరుని కల్యాణం

కొత్తపల్లి, జనవరి 16: మండల కేంద్రమైన కొత్తపల్లిలో వెలసిన పార్వతి సమేత తాండవ మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని పురోహితులు లక్ష్మీనరసయ్య శర్మ, ఉమామహేశ్వరశర్మ, అర్చకులు మల్లికార్జున ఆచార్యుల ఆధ్వర్యంలో దేవదాయ శాఖ సహకారంతో గ్రామ పుర ప్రముఖుల సమక్షంలో కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం ఉదయం స్వామివారికి గణపతి పూజ, సభాపూజ, పుణ్యహవాచనం, రుద్రాభిషేకాలు తదితర ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. దేవదాయ శాఖ తరఫున తెచ్చిన పట్టువస్త్రాలను గ్రామ పెద్దలు బాజా భజంత్రీల మధ్య తెచ్చి స్వామి అమ్మవార్లకు సమర్పించారు. రాత్రి 11 గంటల సమయంలో పురోహితులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు భక్తజన సమక్షంలో కన్యాదానం, జీలకరబెల్లం, మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలతో కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వీధుల గుండా ఊరేగించారు. మంగళవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకాలు, పూజాదిక్రతువులు నిర్వహించిన అనంతరం భక్తాదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి : కేసు నమోదు

జూపాడుబంగ్లా, జనవరి 16: మండలంలోని పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద కాల్వపై సోమవారం ఎటువంటి అనుమతిలేకుండా కోడిపందేలు ఆడుతుండగా దాడిచేసి 15మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మారుతీశంకర్ తెలిపారు. వారివద్ద రూ.19వేలు నగదుతోపాటు, 10కోడిపుంజులు, 40 మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సహాయనిధి సేకరించిన అంగన్వాడీలు

పాములపాడు జనవరి 16 : మండలకేంద్రంలోని దుకాణాదారుల నుంచి అంగన్‌వాడీ వర్కర్లు సహాయనిధికి విరాళాలు సేకరించారు.మంగళవారం పాములపాడులో నిరసనదీక్షలు చేస్తున్న శిబిరం వద్ద తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గత 36 రోజులుగా శాంతి యుతంగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో శివలక్ష్మి, స్వాతి, రవణమ్మ, మద్దమ్మ, నాగమ్మ, హెల్పర్స్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

పాణ్యం, జనవరి 16 : సంక్రాంతి ఉత్సవాలల్లో భాగంగా మండలంలో పలు ఆలయాలలో స్వామివార్ల గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సుబ్బరాయుని కొత్తూరులో మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఆలయ ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

రంగవల్లుల పండుగ సంక్రాంతి

ఆత్మకూరు, జనవరి 16: తెలుగు సంప్రదాయాలకు రంగవల్లులు ప్రత్యేకంగా నిలుస్తాయని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పద్మావతి హైస్కూల్ కరెస్పాండెంట్ ఆశ, స్పేస్ కంప్యూటర్ డైరెక్టర్ భాష అన్నారు. సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని అర్బన్ కాలనీ, ఏకలవ్యనగర్, గొల్లపేటలో మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్,కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

తిరుమలకు పాదయాత్ర

నంద్యాల (కల్చరల్), జనవరి 16: లోక కల్యాణం కోసం నంద్యాల గణేష్ మిత్ర మండలి భక్తులు మంగళవారం తిరుమలకు పాదయాత్ర ద్వారా బయలుదేరారు. ఈ పాదయాత్ర నాలుగు సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు బృందం నిర్వాహకుడు చలంబాబు తెలిపారు.

అక్రమాల వైసీపీని సాగనంపుదాం

- టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర పిలుపు
- చింతల పల్లెలో టీడీపీ జెండా ఆవిష్కరణ
- పీరు సాహెబ్ పేట వైసీపీ నేతల చేరిక


చింతలపల్లె గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న మాండ్ర, నాయకులు

నందికొట్కూరు రూరల్, జనవరి 16 : అక్రమాల వైసీపీని ఇంటికి సాగనంపుదామని టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని మిడుతూరు మండల చింతలపల్లె గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, గ్రామనాయకులు వెంకటేశ్వరరెడ్డి, సర్పంచు రవణమ్మ ఆధ్వర్యంలో పూర్తిచేసిన సీసీరోడ్లను మాండ్ర శివానందరెడ్డి ప్రారంభించారు. అలాగే గ్రామంలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనపై అన్నిరంగాల ప్రజలు పూర్తితో అసంతృప్తితో రగిలిపోతున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు, మన భవిష్యత్తు ఉంటుందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టో కరపత్రాలను గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు. మహిళలకు, గ్రామస్తులకు మినీ మేనిఫెస్టో వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్ర నాథ రెడ్డి, ఎల్లారెడ్డి, రంగారెడ్డి, శివరామిరెడ్డి, ప్రతాప రెడ్డి, రవీంద్రారెడ్డి, జయసూర్య, సుధాకరెడ్డి, నాగముని, నాగేంద్ర, రవీంద్రబాబు, రవికాంతరెడ్డి, రమణారెడ్డి, ఇద్రూస్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


అల్లూరు లో మాండ్ర సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న నాయకులు

నందికొట్కూరు నియోజక వర్గంలోని మిడుతూరు మండల పీరు సాహెబ్ పేట వైసీపీ నాయకులు నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మాండ్ర శివానందరెడ్డి వైసీపీ నుంచి వచ్చిన నాయకులకు టీడీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మహేశ్వరెడ్డి, నాగేశ్వరెడ్డి, ఆర్ మహేశ్వరెడ్డి, డీ మహేశ్వరెడ్డి, పుల్లారెడ్డి, క్రిష్ణ, ఎల్ల నాగరాజు, రఫీ, మధు, చిన్నరాయుడు, మున్న జావళి తదితరులతో పాటు ఇంకా 20 కుటుంబాలకు చెందిన వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, జయసూర్య, ఖాజా హేష్మేన్, సుభాన్ పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు


ప్రథమ బహుమతిని విజేతకు అందిస్తున్న ఫరూక్

నంద్యాల టౌన్, జనవరి 16: నంద్యాల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జీ, పొలిట్ బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌ల ఆధ్వర్యంలో మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఖలీల్ థియేటర్ ఆవరణలో నిర్వహించిన పోటీలకు దాదాపు 80 మందికిపైగా మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొని రంగు రంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. ప్రథమ బహుమతి కింది వెట్ గ్రైండర్, ద్వితీయ బహుమతి కింద మిక్సీ తృతీయ బహుమతి కింద కుక్కర్‌తో పాటు పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులను ఫరూక్ చేతుల మీదుగా అందజేశారు. మకర సంక్రాంతి పర్వదినానికి ఎంతో విశిష్టత ఉందని, సంస్కృతి, సాంప్రదాయల విలువలను భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు వివరిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రారావు, టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి జైనాబీ, టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బోయ గోవిందనాయుడు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు విజయగౌరి, కౌన్సిలర్ శ్రీదేవి, పట్టణ అధ్యక్షుడు ఖలీల్, మాజీ కౌన్సిలర్ మిద్దె చిన్న హుసేని, మల్లికార్జున, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంబరంగా సంక్రాంతి

ఆత్మకూరు రూరల్, జనవరి 16: తెలుగు ప్రజలకు అతిపెద్ద పండగల్లో ఒకటైన సంక్రాంతి పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల ప్రజలు సంబరంగా జరుపుకొన్నారు. తొలిరోజైన ఆదివారం భోగిరోజున భోగిమంటలు, రంగవల్లులతో సందడి చేశారు. రెండో రోజైన సోమవారం మకర సంక్రాంతిని పురస్కరించుకొని ఇళ్ల ఎదుట చక్కటి ముగ్గులను తీర్చిదిద్ది గొబ్బెమ్మలతో అలకరించారు. ఇళ్లలో పిండివంటలు చేశారు. వేడుకల్లో చివరి రోజు మంగళవారం కనుమ పండుగను ప్రజలందరు ఆనందంగా జరుపుకొన్నారు. ఇదిలావుంటే సంక్రాంతి సెలవులను పురస్కరించుకుని తెలుగింటి ఆడపడుచులు పుట్టినిళ్లకు రావడంతో పిల్లాపాపలతో సందడి నెలకొంది. ఆత్మకూరు మున్సిపాలిటీలతో పాటు మండలంలోని వడ్లరామాపురం, కురుకుంద, సిద్దేపల్లి, ముష్టేపల్లి, కరివేన, నల్లకాల్వ, బాపనంతాపురం, కృష్ణాపురం, అమలాపురం, ఇందిరేశ్వరం, శ్రీపతిరావుపేట, సిద్దాపురం గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, యువతకు గ్రామీణ క్రీడాపోటీలను నిర్వహించారు.

తోటగేరిలో ముగ్గులు


కోలాహలంగా పార్వేట ఉత్సవం


ఆత్మకూరులో నిరవధిక దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

మహానంది,జనవరి 16: మహానంది క్షేత్రంలో మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ఉత్సవమూర్తుల విగ్రహాలకు ప్రత్యేకపూజలు, అభిషేకాలను వేదమంత్రాలతో నిర్వహించారు. మంగళవారం సాయంత్రం కనుమ పర్వదినం పురస్కరించుకొని ఆలయంలోని కోదండరాముల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకీ పై ఆశీనులు చేసి మేళతాళాలతో పురవీధుల గుండా ఊరేగించారు. స్థానిక అటవీ పర్యావరణ విద్యాకేంద్రం వద్ద పార్వేట ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమం ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

అతి వేగంతోనే రోడ్డు ప్రమాదాలు

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

ఆత్మకూరు, జనవరి 16: రహదారి నియమాలు పాటించక పోవడంతో పాటు, అతి వేగంతో వాహనదారులు ప్రయాణించడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఆర్టీసి డిపో మనేజర్ మహేంద్రుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసి డిపోలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రోడ్డు భద్రత, ప్రమాదాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు

పగిడ్యాల, జనవరి 16: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో సంక్రాతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో వివిధ గ్రామాల నుంచి 13 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో జనార్ధన్‌రెడ్డి జట్టు మొదటిస్థానంలో గెలుపొందింది. మహేష్ జట్టు రెండొవ స్థానంలో, శ్రీనివాసులు జట్టు మూడొవ స్థానంలో గెలుపొందిన్నట్లు నిర్వాహకులు మల్లయ్య, అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు. గెలుపొందిన జట్లులకు వరుసగా రూ. 5వేలు, 3వేలు, 2వేలు అందజేశారు.

వైభవంగా రథోత్సవం

పగిడ్యాల, జనవరి 16: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలోని కాశీవిశ్వేశ్వర, తూర్పు ప్రాతకోట గ్రామంలోని నాగేశ్వర స్వామి రథోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం భక్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచు పిట్టల శేషమ్మ, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామివారి రథోత్సవాన్ని పురవీధుల గుండా బాజాభజంత్రీలతో ఊరేగించారు.

ప్రత్యేక పూజలు చేసిన మాండ్ర

తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లో నిర్వహించిన రథోత్సవ కార్యక్రమానికి టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవదాయశాఖ అధికారులు భజంత్రీలతో స్వాగతం పలికారు. అనంతరం పండితులు ప్రత్యేక పూజలు జరిపించారు.

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి


ఆత్మకూరులో నిరవధిక దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


మహానందిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్న అంగన్‌వాడీలు


బండిఆత్మకూరులో గడ్డితింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆత్మకూరు రూరల్, జనవరి 16: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఏసురత్నం, రణధీర్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి అన్నారు. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలు చేపడుతున్న నిరాహార నిరసన దీక్షలు 36వ రోజు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా కళలకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధనకై అంగన్‌వాడీలు నివరధిక సమ్మె చేస్తున్నప్పటికీ సీఎం జగన్ స్పందించకపోవడం సరికాదని అన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించుకునేవరకు పోరాటం వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రిటైర్మెంట్ అనంతరం రూ.5లక్షలతో పాటు వేతనంతో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచాలని, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుంచి పెండింగ్‌లో వున్న టీఏ బిల్లులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకురాలు సుధారాణి, వెంకటలక్ష్మి, లక్ష్మి, ప్రియాంక, చెన్నమ్మ, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మి, సుజాత తదితరులు ఉన్నారు.

మహానందిలో...

మహానంది : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు 36 వ రోజు అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. పండుగ పూట కూడ తాము సమ్మెలో కొనసాగడం బాధాకరమన్నారు. తమ సమస్యలను తీర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు నారాయణమ్మ, కొండమ్మ, పాతిమా మేరిరాణి, కళావతి, జ్యోతి ఉషారాణి, ఉమాదేవి, పుష్పకళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్‌రెడ్డి

బండిఆత్మకూరు, జనవరి16 : మండలంలోని పెద్దదేవళాపురం గ్రామంలో సంక్రాంతి, బాదుల్లా స్వామి సరిగెత్తులను పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నిర్వాహకుడు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులశిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల సురేష్‌రెడ్డి, మండల యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు ప్రారంభించారు. ఈ పోటీలలో మొత్త ఎనిమిది జతల వృషబరాజములు పోటీపడ్డాయి. మొదటి విజేతగా కర్నూలు జిల్లా కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన శశాంక్, శ్రీయల ఎద్దులు 3889 అడుగుల దూరంలాగి రూ. 40వేల నగదు బహుమతిని గెలిచాయి. అలాగే వరుసగా 2,3,4వ బహుమతులను కర్నూలు జిల్లా పి. రుద్రవరానికి చెందిన ఎల్లాగౌడ్‌కు చెందిన ఎద్దులు 3600 అడుగులు లాగి రూ.25వేలు, కర్నూలు జిల్లా పి. రుద్రవరానికి చెందిన గోపాల్‌గౌడ్ ఎద్దులు 3472 అడుగులు లాగి రూ20వేలు, బండిఆత్మకూరు మండలం ఎ. కోడూరుకు చెందిన శాన్విత, స్ఫూర్తిరెడ్డి ఎద్దులు 3332.6 అడుగులు లాగి రూ.8వేల నగదు బహుమతిని అందుకున్నాయి. టీడీపీ నాయకులు వీరారెడ్డి, మహేశ్ తారక్ గురుపాదం, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలలో గద్వాల ఎద్దుల జయకేతనం

పగిడ్యాల, జనవరి 16: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి న్యూకేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలలో తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లాకు చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ పోటీలలో 15 జతల ఎద్దులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గద్వాల జిల్లా గోర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ కర్రెప్ప ఎద్దులు నిర్ణీత సమయానికి 3,350 అడుగుల దూరం బండలాగి ప్రథమస్థానంలో నిలిచాయి. కడప జిల్లా రంగసాయిపల్లెకు చెందిన మర్తల వెంకటసుబ్బరెడ్డి ఎద్దులు ద్వితీయ స్థానంలో, కర్నూలు జిల్లా మాసామసీదుకు చెందిన రమేష్ నాయుడు ఎద్దులు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు వరుసగా రూ. 50వేలు, 35వేలు, 20వేలు నిర్వాకులు అందజేశారు.

బాదుల్లా స్వామి సరిగెత్తు ప్రారంభం

బండిఆత్మకూరు, జనవరి16: మండలంలోని పెద్దదేవళాపురం గ్రామంలో జెండా గ్రామోత్సవంతో బాదుల్ల స్వామి సరిగెత్తు ప్రారంభమైంది. మండలంలోని పెద్దదేవళాపురం గ్రామంలో కృష్ణనాయక్ ఆధ్వర్యంలో సరిగెత్తు నిర్వహిస్తున్నారు. రాత్రి సరిగెత్తు నిర్వహించటం, బుధవారం వేకువజామున స్వామి వార్ల గ్రామోత్సవం చేస్తారు. అదే రోజు సాయంత్రం పీర్ల ఖనన కార్యక్రమం నిర్వహిస్తారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలు


వెలుగోడులో పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ బాలుడు

వెలుగోడు, జనవరి 16 : పట్టణంలో పిచ్చికుక్క దాడిలో బాలుడుకి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన అబ్దుల్లా కుమారుడు ఫర్హాన్‌పై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. పట్టణంలోని వీధి కుక్కలపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బుక్కాపురంలో ముత్యాల ముగ్గుల పోటీలు


బహుమతి ప్రధానం చేస్తున్న టీడీపీ నాయకుడు గడ్డం నాగపుల్లయ్య

మహానంది, జనవరి 16: మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో సంక్రాంతి పండుగను పురష్కరించుకొని గ్రామంలో మా ఇంటి ముంగిట మహాలక్ష్మి పేరుతో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా వేసిన ముగ్గులను గ్రామ నాయకులు పరిశీలించారు. అలాగే కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద మహిళలకు పలు రకాల క్రీడలను నిర్వహించారు. గ్రామంలోని పారిశుధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు టీడీపీ నాయకులు గడ్డం నాగపుల్లయ్య, కంచెర్ల శివ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారెడ్డి సుబ్రమాణ్యం, కాకర్ల శివ, గుద్దేటి నాగరాజు, జయరాముడు, పుల్లయ్య పాల్గొన్నారు.

రమణీయం రథోత్సవం


రథోత్సవంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ సభ్యులు

నంద్యాల (కల్చరల్), జనవరి 16: నంద్యాల భగవత్ సేవా సమాజ్ కమిటి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సంజీవనగర్ కోదండరామాలయం నుంచి కనులపండువగా శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామివారి విష్ణుభాగ్య రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవ శోభాయాత్రలో డప్పులు, మేలతాళాలతో, భజనలు, మహిళలచే కోలాటప్రదర్శన,చెక్క భజనలు, హరిదాసు సంకీర్తనలు చేసుకుంటూ ఉత్సవమూర్తులకు అంగరంగ వైభవంగా రోథోత్సవం నిర్వహించారు. ఈ శోభాయాత్ర చందనబ్రదర్స్ ఆర్చ్, రామక్రిష్ణ డిగ్రీకాలేజి ఆర్చ్, శ్రీనిధిసెంటర్, శ్రీనివాససెంటర్, ప్రతాప్‌థియోటర్, సాయిబాబాఆలయం మీదుగా కల్పనసెంటర్ నుంచి గాంధిచౌక్ తిరిగి సంజీవనగర్ రామాలయం చేరుకుంది. స్వామి వారకి లోక కళ్యాణార్థం ప్రత్యేక అలంకరణతో ఏర్పాటుచేసిన ఈ విష్ణుభాగ్య రథోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులు ఆసీనమయ్యారు.

వైభవగా సోమనందీశ్వరస్వామి కల్యాణం : నంద్యాల ఆత్మకూరు బస్టాండు సమీపంలోని సోమనందీశ్వరాలయంలో ఆలయశాశ్వత ధర్మకర్త బిల్లుపాటి వెంకట శంకరయ్య, అర్చకుల ఆధ్వర్యంలో మంగళవారం స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు.

గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు


పాత గాంధీ విగ్రహాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ రాజేష్

డోన్, జనవరి 16: పట్టణంలోని పాత బస్టాండులో గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. దశాబ్దాల క్రితం పాతబస్టాండులో ఉన్న గాంధీ విగ్రహం ప్రస్తుతం పాతబడి విరిగిపోయింది. వాటి స్థానంలో నూతనంగా కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ పాలకవర్గం తీర్మానించింది. మంగళవారం స్థానిక పాత బస్టాండులోని గాంధీ విగ్రహాన్ని చైర్మన్ రాజేష్ పరిశీలించారు. మున్సిపాలిటీ నిధులు రూ.12లక్షలతో కాంస్య గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

పండుగ కానుకల రద్దు బాధాకరం

ప్యాపిలి, జనవరి 16: పేదలకు పండగ పూట ఇచ్చే కానుకలను వైసీపీ రద్దు చేయడం బాధాకరమని టీడీపీ మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య అన్నారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని కలచట్ల గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పేదలకు సంక్రాంతి, రంజాన్‌తోఫా, క్రిస్మస్ కానుకలు ఇచ్చేవారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వైసీపీ రద్దు చేసిన కానుకలను పునరుద్ధరిస్తామని తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సలీంద్ర శ్రీనివాసులు, కలచట్ల ప్రసాద్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై వాహనాల తనిఖీలు


ప్యాపిలిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్యాపిలి, జనవరి 16: మండలంలోని పోతుదొడ్డి గ్రామ సమీపంతో జిల్లా సరిహద్దు దగ్గర 44వ జాతీయ రహదారిపై మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. సీఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో సాధారణ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాల్లో నిబంధనలకు విరుద్ధంగా నగదుతో పాటు ఎటువంటి ఆయుధాలు తీసుకెళ్లిన సీజ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

ఒంటెద్దు బండి బండలాగుడు పోటీలు


గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు అందజేస్తున్న నాయకులు

చాగలమర్రి, జనవరి 16: చాగలమర్రిలోని మల్లేవేముల రహదారిలో సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం టీడీపీ నాయకుడు మౌలాలి, అనిఫ్ ఆధ్వర్యంలో హోరాహోరీగా ఒంటెద్దు బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. పోటీల్లో కొలిమి చాంద్‌బాషా వృషభాలు మొదటి స్థానంలో గెలుపొందడంతో రూ.4 వేలు, జాఫర్ వృషభాలు రెండో స్థానంలో రూ.3 వేలు, అలిబాషా వృషభం మూడో స్థానంలో రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉసేన్‌వలి, జనసేన నాయకుడు గంగవరం సుబ్బయ్య పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



రుద్రవరం, జనవరి 16 : మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలో క్రీడా పోటీలు ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

కానాలతో యువతకు క్రికెట్ పోటీలు

సంజామల, జనవరి 16: కానాల గ్రామంలో యువతకు క్రికెట్ పోటీలను గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు కేవవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. విజేతలకు సొంత నిధులతో బహుమతులు అందించారు. గ్రామానికి చెందిన 6 టీంలు పోటీలో పాల్గొనగా ప్రథమ విజేతగా అభిరాం, ద్వితీయ విజేతగా ఎస్సీ కాలనీ టీం విజేతగా నిలిచారు.విజేతలకు బహుమతులు అందజేశారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచుకోవాలి

డోన్(రూరల్), జనవరి 16: యువత శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో జనవిజ్ఞాన వేదిక క్యాలెండర్లు, డైరీని ఆవిష్కరించారు.

ఎస్ఐగా ఎంపికైన వీరప్రతాప్‌కు సన్మానం


ఎస్ఐగా ఎంపికైన వీరప్రతాప్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, గ్రామ పెద్దలు

చాగలమర్రి, జనవరి 16: మండలంలోని తోడెండ్లపల్లె గ్రామానికి చెందిన ఓబులేసు, వెంకటలక్ష్మమ్మ కుమారుడు వీరప్రతాప్ ఏపీఎస్పీ ఎస్ఐగా ఎంపికయ్యారు. మంగళవారం సంక్రాంతి సందర్భంగా వీరప్రతాప్‌ను గ్రామంలో ఎంపీపీ వీరభద్రుడు, గ్రామ పెద్దలు కలిసి శాలువ, పూలమాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, గిరిరాజా, శ్రీనివాసులు, సంజీవ, అంజనేయులు, సంజీవరాయుడు, పెద్దవీరయ్య పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ ఎస్ఐగా రామాంజనేయరెడ్డి



ఉయ్యాలవాడ, జనవరి 16: మండలంలోని స్థానిక సబ్‌స్టేషన్ ఎస్ఐగా రామాంజనేయరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బనగానపల్లె మండలంలోని నందివర్గం ఎస్ఐ విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ అయ్యారు.

నందివర్గం ఎస్ఐగా తిరుపాలు



బనగానపల్లె, జనవరి 16: మండలంలోని నందివర్గం ఎస్ఐగా తిరుపాలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నందివర్గం ఎస్ఐగా పనిచేస్తున్న ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఉయ్యాలవాడకు బదిలీ అయ్యారు. తిరుపాలు దొర్నిపాడులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై నందివర్గంకు వచ్చారు.


అవుకులో పల్లకిపై విహరిస్తున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి


ఉయ్యాలవాడ మండలం హరివరంలో జనార్దనస్వామికి గ్రామోత్సవం


మల్లేవేముల గ్రామంలో చెన్నకేశవ ఉత్సవమూర్తుల ఊరేగింపు

ముగిసిన సంక్రాంతి సంబరాలు


బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లెలో చెన్నకేశవస్వామి ఊరేగింపు

బనగానపల్లె , జనవరి 16: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామాల్లో పార్వేట సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. యాగంటి క్షేత్రంలో ఉమామహేశ్వరస్వామి పార్వేటు ఉత్సవానికి పల్లకిలో సోమ, మంగళవారాల్లో 5 గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా పర్యటించి గ్రామోత్సవం కార్యక్రమాలు ఊరేగించారు. యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, అలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, ఆలయ పూజారులు ఉమామహేశ్వరస్వాముల ఉత్సవ విగ్రహాలకు యాగంటిలో ప్రత్యేక పూజలు నిర్వహించి పార్వేట ఉత్సవాలకు సోమవారం బయలుదేరారు. కొండదిగిన ఉమామహేశ్వరస్వామి వారు పల్లకి ద్వారా యాగంటి క్షేత్రం నుంచి ఉమామహేశ్వరులు బయలుదేరి పాతపాడు గ్రామం చేరుకున్నారు. పాతపాడు నుంచి మీరాపురం, యాగంటిపల్లె, సాధుకొట్టం, మాదాసుపల్లె గ్రామాల్లో పల్లకిలో ఊరేగించారు. మీరాపురం, యాగంటిపల్లె గ్రామాల్లో సీతా రాముల విగ్రహాలను ఉమామహేశ్వస్వామి వెంట ఊరేగించారు. మంగళవారం సాయంత్రం పాతపాడుకు గ్రామానికి చేరుకోగా సర్పంచ్ మహేశ్వరరెడ్డి, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు.

● బనగానపల్లె మండలం భానుముక్కల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని భానుముక్కల రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం వెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

● పలుకూరు గ్రామంలో పార్వేట ఉత్సవ కార్యక్రమాలు సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రామేశ్వరస్వామి ఆలయం నుంచి సీతారామ ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

రుద్రవరం: రుద్రవరంలో శివపార్వతుల ఉత్సవాలను పల్లకిలో గ్రామ సేవకులు పార్వేటకు తీసుకెళ్లారు. పల్లకిని బోయిలు మోసుకుంటూ గ్రామ సమీపానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. భాస్కర నందీశ్వరాలయం తరపున పార్వేట (పరుగు పందెం) నిర్వహించారు. పరుగు పందెంలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

● మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం ముగ్గుల పోటీ గ్రామ నిర్వాహకులు నిర్వహించారు.

అవుకు: మండలంలోని ప్రజలు సంక్రాతి, కనుమ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.అవుకు పట్టణంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

చాగలమర్రి: మండలంలోని మల్లేవేముల గ్రామంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో చెన్నకేశవ పారువేట ఊరేగింపు చేశారు. కళాకారులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈదుల సరోజమ్మ, గ్రామ పెద్దలు ప్రతాప్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, మల్లారెడ్డి, స్వామిరెడ్డి, జ్యోతిశ్వర్‌రెడ్డి, బలరామిరెడ్డి పాల్గొన్నారు.

● మండలంలోని చిన్నవంగలి, గొడిగనూరు, చిన్నబోదనం, మద్దూరు, ముత్యాలపాడు గ్రామాల్లో మంగళవారం పారువేట ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. చిన్నవంగలిలో గుహమద్దిలేటిస్వామి, గొడిగనూరులో సీతారాములు, ముత్యాలపాడులో మూర్తి నరసింహస్వామి, మద్దూరులో వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు ఊరేగింపు చేశారు.

బేతంచెర్ల: గ్రామాల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గౌరిపేటలో వెలసిన ఆంజనేయ చెన్నకేశవ, మాధవగట్ల నరసింహ స్వామి దేవాలయాల్లో గ్రామోత్సవం, పారువేట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పారువేటలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మద్దిలేటి, గ్రూపు దేవాలయాల ధర్మకర్తల మండలి చైర్మన్ గుండా జగన్మోహన్‌రావు, గౌరి హుశేన్ రెడ్డి, పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● బుగ్గానిపల్లె గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి ఊరేగింపును అశేష జనవాహిని మధ్య గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శివశంకర్ నాయక్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు కేశవ నాయుడు, శేఖర్ రెడ్డి, నాయుడు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఉయ్యాలవాడలో సాయంత్రం కోండరామస్వామి విగ్రహాన్ని ఊరేగించారు. హరివరంలో లక్ష్మీజనార్దన స్వాముల వారికి గ్రామోత్సవం నిర్వహించారు.

ప్యాపిలి: పట్టణంలో సంక్రాంతి వేడులను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని జలదుర్గం, హుసేనాపురం, చంద్రపల్లి, రాచెర్ల, బోంచెర్వుపల్లి తదితర గ్రామాల్లో వేడుకలను ఘనంగా జరిగాయి. పట్టణంలోని సాయిబాబా, దుర్గాదేవి, హనుమాన్, కన్యకా పరమేశ్వరిదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంజామల: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మంగళవారం పార్వేట ఉత్సవాలను నిర్వహించారు. సంచామలలో కొలువైన వ నం వెంకటేశ్వరస్వామికి పార్వేట నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను సంజామల, ముచ్చల పురి, ఎగ్గోని, కొత్తపేట గ్రామాల మీదుగా ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. గ్రామపెద్దలు రఘురామయ్య, రాజారెడ్డి, రవీంద్రుడు, ప్రతాప్‌రెడ్డి, మగ్బుల్‌హుసేన్ ఆధ్వర్యంలో స్వామివారి పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. యువతకు పరుగు పోటీలు నిర్వహించారు.

● సంజామలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కనుకూలి వేలం నిర్వహించారు. అత్యధికంగా రూ.2.97,500 వేలంపాట సాగింది. మంగళవారం గ్రామపెద్దల ఆధ్వర్యంలో కనుకూలి వేలం పాట నిర్వహించారు. బండారువెంకట్రామయ్య అనే వ్యక్తి కనుకూలివేలం పాట కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో బండారు వెంకట్రామయ్య, కుమ్మరి బుజ్జి, లక్ష్మిపల్లె శ్రీనులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: గ్రామాల్లో సంక్రాంతి, కనుమ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామచంద్రాపురం గ్రామంలో సీతారాముల ఉత్సవమూర్తులకు ఊరేగింపుగా తీసుకెళ్లి కోలాటం మధ్య గ్రామోత్సవం నిర్వహించి కొలనులో తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహించారు. చాకరాజువేముల గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు కబడ్డీ, ఖోఖో తదితర ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను కమిటీ సభ్యులు బాలనరసింహుడు, వెంకటయ్య, ఓబులేసు, నాగరాజు, లక్ష్మీతిరుపాలు, చంద్రశేఖర్ అందజేశారు.

శిరివెళ్ల: గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం, పార్వేట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కోవెలకుంట్ల: మండలంలో సంకాంత్రి, కనుమపండుగ వేడుకలను సాంప్రదాయబద్ధంగా సోమ, మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని పాండు విఠలేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో ఊరేగించారు. కోవెలకుంట్ల నుంచి సౌదరదిన్నె, అమడాల గ్రామం వరకు స్వామిని ఊరేగించారు. గ్రామాల్లో పార్వేటు ఉత్సవాలు నిర్వహించుకొని పండుగను జరుపుకున్నారు.


యాగంటిలో ఉమామహేశ్వరుస్వామి ఉత్సవ విగ్రహాలు


చాగలమర్రి: చిన్నవంగలిలో గుహ మద్దిలేటిస్వామి ఊరేగింపు


శిరివెళ్ల : కామినేనిపల్లెలో పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు


కోవెలకుంట్లలో పాండురంగ విఠలేశ్వరస్వామి ఊరేగింపు


ప్యాపిలి బాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

రైతుల అనుమతి లేకుండా సోలార్ ప్రాజెక్టుకు భూములు తీసుకోరాదు



మాట్లాడుతున్న నాయకులు

బనగానపల్లె, జనవరి 16: సోలార్ ప్రాజెక్టుకు రైతుల అనుమతి లేకుండా భూములు తీసుకోరాదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం వారు పాతపాడు గ్రామంలో మాట్లాడుతూ పాతపాడు, యాగంటి, మీరాపురం, ఫతేనగర్, కటికవానికుంట గ్రామాల్లో 650 ఎకరాల్లో సోలార్‌ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి 350మంది రైతుల నుంచి అనుమతు లేకుండానే భూములను తీసుకుంటున్నారు. అధికార పార్టీ అండదండలతో రైతుల భూములు లాక్కోవడానికి సోలార్ ప్రాజెక్టు వారు దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ జోక్యం చేసుకొని గ్రామ సభలు జరిపి రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి సుబ్బయ్య, మద్దిలేటితో పాటు రైతులు పాతపాడు వెంకటేశ్వర్లు, కళాధరుడు, నారాయణరెడ్డి, మహేంద్ర, సత్యంరెడ్డి, ఎల్లకృష్ణుడు, గోపాల్, తిమ్మరాజు, బాబయ్యరమణయ్య, రామచంద్రుడు, మద్దిలేటిస్వామి, సురేశ్ బాబు, భాస్కరయ్య, తదితర రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

శిరివెళ్ల, జనవరి 16 : మండలంలోని జీనేపల్లె గ్రామానికి చెందిన షేక్ రఫి మృతి చెందడంతో గుంప్రమాన్‌దిన్నె టీడీపీ నాయకుడు కుందూరు మోహన్ రెడ్డి రఫి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

డోన్, జనవరి 16: పట్టణంలోని తారకరామ నగర్‌లో జనసేన నాయకుడు రాయల్ మల్లికార్జున ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో పాల్గొని వేసిన ముత్యాల రంగవల్లులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మాజీ జడ్పీటీసీ పద్మావతమ్మ, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ మర్రి సరళాదేవి, కుమారీ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున తదితరులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ రఫి, శశి యూత్ ఆర్గనైజింగ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ధనుర్మాస పూజలు


కోదండ రామాలయంలో కోలాట నృత్యం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జనవరి 16: మండలంలోని చెన్నకేశవ, పట్టాభిరామ, కోదండరామ, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. నెలరోజుల పాటు ఆలయాల్లో వేద పండితుల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా మంగళవారం కోదండరామాలయంలో వాసవీ మహిళలు కోలాట నృత్యం చేశారు. సీతారాముల పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహంచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తి పై గొడ్డలితో దాడి

ఆళ్లగడ్డ, జనవరి 16: ఆళ్లగడ్డ మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో రవి అనే వ్యక్తి తాగిన మైకంలో మల్లికార్జునపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో కుడి భుజంపై తీవ్రమైంది. ఈ విషయాన్ని గమనించిన చుట్టు పక్కల వారు అతన్ని తరిమి వేయడంతో ప్రాణాపాయం నుంచి మల్లికార్జున బయట పడ్డాడు. అంతకు ముందు గ్రామ సమీపంలోని కాశీనాయన ఆశ్రమంలో అన్నం తిని గొడవ పడుతుండగా అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది మందలించి పంపించారు. ఆ తరువాత ఈ ఘటన చోటు చేసుకుంది.

వైభవంగా మకరజ్యోతి


చాగలమర్రి అయ్యప్ప ఆలయంలో వెలుగుతున్న మకరజ్యోతి దృశ్యం

చాగలమర్రి, జనవరి 16: చాగలమర్రి గ్రామంలోని ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి అయ్యప్ప ఆలయం ఎదుట మకరజ్యోతిని వెలిగించి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సుంకు జనార్దన్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ


అయోధ్య అక్షింతలతో భక్తులు

రుద్రవరం, జనవరి 16 : మండలంలోని టి.లింగందిన్నె గ్రామంలో మంగళవారం అయోధ్య శ్రీరామచంద్రుని అక్షింతలు పంపిణీ చేశారు. మేళతాళాలతో పురవీధుల గుండా ఇంటింటికీ తిరిగి శ్రీరామ అక్షింతలు అందించారు.